క్లుప్తంగా

కోటయ్య దర్శనానికి సిద్ధమైన మున్సిపల్ ప్రభ



నరసరావుపేట ఈస్ట్: మహాశివరాత్రి పర్వదినానికి నరసరావుపేట పట్టణం ముస్తాబవుతున్నది. ఈనెల 8వ తేదీన మహాశివరాత్రి పర్వదినాన జరగనున్న కోటప్పకొండ శైవక్షేత్రానికి తరలివచ్చే లక్షలాది మంది భక్తులకు స్వాగతం పలికేలా మున్సిపల్ అధికారులు పట్టణాన్ని సుందరీకరిస్తున్నారు. పట్టణం నడిబొడ్డున ఉన్న శివుని బొమ్మకు నూతన సొబగులు దిద్దుతున్నారు. అలాగే పట్టణంలోని ప్రధాన కూడళ్లతో పాటు తిరునాళ్లకు తరలివెళ్లే కోటప్పకొండ రోడ్డుకు విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. తిరునాళ్లకు ఆనవాయితీగా మొదటి ప్రభగా తరలివెళ్లే పురపాలక సంఘం ప్రభను సిద్ధం చేశారు. ప్రభకు మంగళవారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి బుధవారం ఏకాదశి సందర్భంగా కొండకు తరలివెళ్లేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. పూజా కార్యక్రమాలలో మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రరెడ్డి, డీఈ ఓలేటి శ్రీనివాసరావు, టీపీఓ నరసింహారావు, మాజీ కౌన్సిలర్ ఎం.రమణారెడ్డి, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

శావల్యాపురం మండలంలో ఎమ్మెల్యే పర్యటన నేడు

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన 33/11 కె.వి.విద్యుత్ సబ్ స్టేషను మధ్యాహ్నం 12 గంటలకు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదగా ప్రారంభోత్సవం జరుగుతుందని మండల విద్యుత్‌శాఖాధికారి సంపెంగుల గాంధీ మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి నరసరావుపేట ఎగ్జికూటివ్ ఇంజినీరు (డీఈ) శ్రీనివాసరావు, ఏడీఏ భవనం వెంకటేశ్వర రెడ్డి ప్రజాప్రతినిధులు హాజరవుతున్నట్లు తెలిపారు. అలాగే మండలంలోని కొత్తలూరు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 500 మెట్రిక్ టన్నులు గోదాం, వైస్సార్ క్లీనిక్ భవన సముదాయాలు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేతుల మీదగా సాయంత్రం 5 గంటలకు ప్రారంభోత్సవం కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి తెలిపారు.

రాజమండ్రిలో వజ్రగిరి జెస్టిస్ చిత్రకళా ప్రదర్శన

వినుకొండ(నూజెండ్ల): రాజమండ్రి ఆదిత్య డిగ్రీ కళాశాల ఆవరణలో తెలుగు మాస్టారు సుదర్శన్ ఆధ్వర్యంలో వినుకొండ పట్టణానికి చెందిన ప్రముఖ చిత్రకారుడు వజ్రగిరి జెస్టిస్ గీసిన 20 చిత్రాలతో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. ఈ ఎగ్జిబిషన్‌లోని చిత్రాలు పలువురిని ఆకట్టుకున్నాయి. అనంతరం వజ్రగిరి జెస్టిస్‌కు పౌరసన్మానం చేశారు. ఒంగోలు బ్యూలా టీచర్, విజయవర్ధన్, చిత్రకారుడు వెంకటరమణ పాల్గొన్నారు.

అన్నదానానికి బియ్యం తరలింపు

వినుకొండ(నూజెండ్ల): మండలంలోని తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన వడ్డెర సంఘం సభ్యులు త్రిపురాంతకంలో వేంచేసి ఉన్న శ్రీ బాల త్రిపురసుందరీ, త్రిపురాంతకేశ్వర ఆలయానికి 12 క్వింటాళ్ల బియ్యాన్ని అన్నదానం నిమిత్తం తరలించారు. మహాశివరాత్రిని పురస్కరించుకొని ఆలయానికి వచ్చే భక్తులకు వడ్డేరాజుల సత్రం తరపున అన్నదానం చేయనున్నట్లు సత్రం అధ్యక్షుడు డి. శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో పల్లెపు వెంకటేశ్వర్లు, బందారు చిన్న కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్త నాగిరెడ్డిపల్లిలో వైద్యశిబిరం

వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం కొత్త నాగిరెడ్డిపల్లి గ్రామంలో జ్వరాల కేసులు నమోదు కావడంతో ఐనవోలు వైద్యాధికారిణి డాక్టర్ ఎస్‌కే వహిద రెహమాన్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యశిబిరంలో జ్వరపీడితులకు రక్తపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. గ్రామంలో ఇంటింటి సర్వే చేపట్టి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా సబ్ యూనిట్ ఆఫీస్ సూపర్‌వైజర్ బాలస్వామి, హెల్త్ అసిస్టెంట్ కె.వెంకట్రావు, వి.సురేష్, సీహెచ్‌వో మేరి వాణి, ఏఎన్ఎం జి.వెంకట రమణ, ఆశలు అనురాధ, మార్తమ్మ, రేణుక పాల్గొన్నారు.

గెజిట్ ఇవ్వడంపై ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

యడ్లపాడు: ఇకపై ఏటా జూన్ 20న రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించుకునేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గెజిట్ విడుదల చేయడంపట్ల యడ్లపాడు గ్రామరెవెన్యూ ఉద్యోగుల హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం సంఘం అధ్యక్షులు కేపీ చారి, కార్యదర్శి ప్రేమ్‌రాజు మాట్లాడుతూ 1976 జూన్ 20న ఆవిర్భావమై రెవెన్యూ వ్యవస్థ నాటి నుంచి జననం నుంచి మరణం వరకు జనంతో మమేకమై 64 రకాల సేవలు అందిస్తుందన్నారు. దశాబ్ధాలుగా ఎన్నో సేవలు అందిస్తున్న తమకు ప్రత్యేక దినోత్సవాన్ని ఏర్పాటు చేసుకుని, సీనియర్లను గౌరవించుకునే వెసలుబాటు కల్పించాలని రెవెన్యూ ఉద్యోగులు ఏళ్ల తరబడి పోరాటాలు చేస్తూనే ఉన్నారన్నారని తెలిపారు. అయితే రెవెన్యూ ఉద్యోగ సంఘాల వినతుల్ని పరిశీలించి పరిష్కరిస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సోమవారం జీవో 81 ఉత్తర్వులు జారీ చేశారన్నారు. స్పందించిన సీఎం జగన్ మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ ర్యాలీకి బ్రహ్మరథం

- పేటలో ఉప్పొంగిన ఉత్సాహం
- నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం



సిద్ధం సభ పోస్టర్ ఆవిష్కరిస్తున్న అనిల్‌కుమార్ యాదవ్, మర్రి రాజశేఖర్, మల్లెల రాజేష్‌నాయుడు ఇతర నాయకులు

చిలకలూరిపేట: ఉత్సాహం ఉప్పొంగింది.. వైఎస్సార్ సీపీ పతాకాలు రెపరెపలాడాయి... జై జగన్ నినాదాలతో వీధులు పిక్కటిల్లాయి. వైఎస్సార్ సీపీ నరసరావుపేట పార్లమెంట్ సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ పి. అనిల్‌కుమార్ యాదవ్ తొలిసారి చిలకలూరిపేటకు విచ్చేసిన సందర్భంగా పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధుల ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అనిల్ కుమార్ యాదవ్‌కు స్వాగతం పలుకుతూ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్‌నాయుడు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ ఏర్పాటు చేశారు. ముందుగా నరసరావుపేట రోడ్డులో ఉన్న గంగమ్మతల్లి ఆలయం వద్ద అనిల్‌కుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం లభించింది.

గంగమ్మతల్లి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్సీ, కృష్ణా, ఎన్‌టీఆర్ జిల్లాల రీజినల్ కో ఆర్డినేటర్ మర్రి రాజశేఖర్ నివాసానికి నాయకులు వెళ్లి ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం ముగ్గురు నాయకులు పార్టీ శ్రేణులను కలిసి జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. ర్యాలీ సందర్భంగా పట్టణ వీధులు కిటకిటలాడాయి. ర్యాలీ ఎన్ఆర్‌టీ సెంటర్, భాస్కర్ సెంటర్ మీదుగా కొనసాగింది. భాస్కర్ సెంటర్‌లో మహానేత డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి, మాజీ ఎమ్మెల్యే సోమేపల్లి సాంబయ్య విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అక్కడి నుంచి సభా వేదిక ఏర్పాటు చేసిన మండపానికి చేరుకున్నారు.

అనంతరం సభా వేదికపై నాయకులు ప్రసంగిస్తున్నప్పుడు కార్యకర్తలు కరతాళ ధ్వనులతో హోరెత్తించారు. సభలో ఈ నెల 10న మేదరమెట్లలో నిర్వహిస్తున్న సిద్ధం సభ పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. సభ అనంతరం ముస్లింలు అనిల్ కుమార్ యాదవ్, మర్రి రాజశేఖర్, మల్లెల రాజేష్ నాయుడు ఇతర నాయకులకు ఆత్మీయ సన్మానం నిర్వహించారు. పలువురు ప్రజా సంఘాల నాయకులు పుష్పగుచ్ఛాలు అందించి అభిమానం చాటుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ పరిశీలకుడు చిట్టా విజయ భాస్క రెడ్డి, రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఎస్.గాయత్రీ సంతోషిణి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ వర్ల నారాయణ, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వైస్ చైర్మన్లు కొలిశెట్టి శ్రీనివాసరావు, వలేటి వెంకటేశ్వరరావు, ఎంపీపీలు దేవినేని శంకరరావు, పిడతల ఝాన్సీ, తలతోటి రాణి, జెడ్పీటీసీ సభ్యులు కోడె సుధారాణి, కాట్రగడ్డ మస్తాన్‌రావు, ముక్తా వాసు, పార్టీ పట్టణ అధ్యక్షులు క్లస్టర్–1 పఠాన్ తలహాఖాన్, క్లస్టర్–2 విడదల కమలేంద్ర, మాజీ అధ్యక్షుడు ఏవీఎం సుభాని, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల పార్టీ అధ్యక్షులు గుత్తా యాములయ్య, మద్దూరి కోటిరెడ్డి, ఘంటా శంకర్ పార్టీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి షేక్ అల్లీమియా, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి చల్లా యజ్ఞేశ్వరరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్లు బొల్లెద్దు చిన్నా, మద్దిరాల విశ్వనాథం, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు సయ్యద్ సిరాజ్. సొసైటీ అధ్యక్షులు కొండవీటి ఆంజనేయులు, మంగు ఏడుకొండలు, కొసల శివరామకృష్ణ, ఓరుగంటి పూర్ణయ్య, కురుగుంట్ల వెంకటరెడ్డి, పార్టీ మైనార్టీ విభాగం పట్టణ అధ్యక్షుడు బేరింగ్ మౌలాలి, జేసీఎస్ కన్వీనర్ రవి శాస్త్రి, పార్టీ వివిధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

యడ్లపాడు: వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పోలీసుల కథనం ప్రకారం.. యడ్లపాడు మండలం ఉప్పరపాలెంలో నివాసం ఉంటున్న గొర్రెల కాపరి వల్లెపు ఏసోబు(ఏసుబాబు)తో తెనాలి మండలం సంగంజాగర్లమూడి గ్రామానికి చెందిన కాకుమాను వెంకట కోటేశ్వరితో 12 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి 11 ఏళ్ల కుమారుడు. 9 ఏళ్ల కుమార్తె ఉన్నారు. భర్త సంపాదనకు సాయంగా టైలరింగ్ చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కోటేశ్వరీ సోమవారం రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో అందరూ నిద్రిస్తుండగా రేకుల షెడ్డుకు ఉన్న ఇనుప రాడ్డుకు చీరెతో ఉరి వేసుకుంది. అప్పుడే మెలకువ వచ్చిన భర్త ఏసోబు గమనించగా అప్పటికే కోటేశ్వరీ (34) మృతి చెందింది. దీంతో పోలీసులకు సమాచారం అందించాడు. మంగళవారం ఉదయం ఉప్పరపాలెం వచ్చిన కోటేశ్వరీ తల్లిదండ్రులకు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ బిడ్డకు తరచు తలనొప్పి వస్తుందని, అనారోగ్య సమస్యతో ఆత్మహత్యకు పాల్పడినట్లు ఫిర్యాదులో మృతురాలి తల్లి పేర్కొంది. ఎస్ఐ శామ్యూల్ రాజీవ్‌కుమార్ కేసు నమోదు చేసుకుని చిలకలూరిపేట ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

వినుకొండలో ప్రచార రథాలు సిద్ధం



ప్రచార రథాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార రథం

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ప్రచార రథకాలను మంగళవారం ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించాలన్నారు. 2024 ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డిని మరలా ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. ఎల్‌ఈడీ స్కీన్, అత్యాధునిక పరికరాలతో ప్రచార రథాలు రూపొందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ యువనేత బొల్లా గిరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వినుకొండకు పట్టిన గ్రహణం మాజీ ఎమ్మెల్యే జీవీ

- ఎమ్మెల్యే బొల్లా విమర్శ
- తాగునీటి సమస్యను ఆసరాగా తీసుకొని ప్రజాధనం దోచుకున్నది ఆయనే
- వినుకొండ తాగునీటి సమస్యను పరిష్కరించింది మేమే
- రాజకీయ మైలేజీ కోసమే అసత్యప్రచారాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ(నూజెండ్ల): ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిసహాయసహకారాలతో వినుకొండ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తుంటే అభివృద్ధి పనులను అడ్డుకుంటూ మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు వినుకొండకు శనిలా దాపురించాడని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు విమర్శించారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే బొల్లా మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఉంటూ చుట్టం చూపుగా వినుకొండ వచ్చి ఉన్న రెండు రోజులు అసత్య ప్రచారాలు చేసి మరలా కనిపించకుండా పోవడమే జీవీ నైజమన్నారు. వినుకొండ ప్రజలకు తాగునీటి సమస్యను పరిష్కరించింది తామైతే, తాగునీటి సమస్యను ఆసరాగా తీసుకొని ట్యాంకర్ల పేరుతో కోట్ల రూపాయలు దోచుకున్న చరిత్ర మీదన్నారు. అసలు తాగునీటి సమస్యపై మాట్లాడే హక్కు జీవీకి లేదన్నారు. గాయత్రినగర్‌లో తాగునీటి ట్యాంకర్లు కట్టింది ఎవరని, పైపులైన్‌లు వేస్తుంది ఎవరని ప్రశ్నించారు. తాగునీటి పనులపై కూడా కోర్టుకు వెళ్లిన నీచప్రవర్తన నీదే అన్నారు. టిడ్కో ఇళ్లు మీ హయాంలో ఆగిపోతే తమ హయాంలో పూర్తి చేశామన్నారు.

తాము చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక చంద్రబాబు చేత కూడా అసత్యాలు మాట్లాడించి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని అన్నారు. చంద్రబాబే తప్పు చేసి జైలుకు వెళ్లారని, తనను జైల్లో పెడతామని అనడం విడ్డూరంగా ఉందన్నారు. నీతి, నిజాయితీగా ఉన్నంతకాలం ఎవరికి భయపడాల్సిన అవసరం లేదని చెప్పారు. మరో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు నియోజకవర్గంలోని చేపల చెరువులను కబ్జా చేసి హత్యారాజకీయాలు చేసింది నిజం కాదా అని ప్రశ్నించారు.

టీడీపీని గెలిపిస్తే వీధికొక ఎమ్మెల్యే తయారవుతారని, ప్రజల ఆస్తులకు కూడా రక్షణ ఉండదని, అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ బత్తుల వెంకటేశ్వర్లుయాదవ్, మాజీ చైర్మన్ అమ్మిరెడ్డి అంజిరెడ్డి, ఎంపీపీ జయశ్రీ వెంకట రామిరెడ్డి, తలారి ఆంజనేయులుతో పాటు పలువురు నాయకులు ఉన్నారు.

ఫ్యాన్లు బహూకరించిన పూర్వ విద్యార్థులు



పాఠశాలకు ఫ్యాన్లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రొంపిచర్ల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మంగళవారం పూర్వ విద్యార్థులు 12 ఫ్యాన్లు బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న ప్రధానోపాధ్యాయులు బి.యం. సుభానీ మాట్లాడుతూ పాఠశాలకు పూర్వ విద్యార్థులు సేవా దృక్పథంతో ఫ్యాన్లు బహూకరించటం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రస్తుతం చదువుచున్న విద్యార్థులు పూర్వ విద్యార్థులను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్‌లో ఉన్నత స్థాయికి చేరుకున్న తరువాత పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.17 వేల రూపాయలు విలువజేసే 12 ఫ్యాన్లు అందజేశారు. అదే విధంగా విద్యార్థులు నిర్వహించిన క్విజ్ పోటీలో గెలుపొందిన వారికి కూడా పూర్వ విద్యార్థులు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాలకు ఫ్యాన్లు అందజేసిన పూర్వ విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ తవనం రామిరెడ్డి, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, వెంకటేశ్వర్లు, సైదయ్య, గ్రామ పెద్దలు సాగి రాంబాబు, వెంగళ రాజు వెంకటసుబ్బరాజు, పూర్వ విద్యార్థులు పిడెం హుస్సేన్, పంబా వెంకట్, పేరుబోయిన నాగేశ్వరరావు, సరికొండ తిమ్మరాజు, కుమ్మెత వెంకటేశ్వర రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితుడి అరెస్ట్

నరసరావుపేట టౌన్: అక్రమ మద్యం కేసులో నిందితుడిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 14 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ నయనతార మంగళవారం తెలిపారు. యలమంద గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. అక్కడ 14 బాటిళ్ల మద్యం కలిగి ఉన్న నిందితుడిని అరెస్ట్ చేశామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు సీఐ తెలిపారు.

నేడు ఆలయ భూముల బహిరంగ కౌలు వేలం

నాదెండ్ల: తూబాడు గ్రామంలో కొలువైయున్న ఉమామహేశ్వరస్వామి దేవస్థానం, చెన్నకేశవస్వామి దేవస్థానం, ఆంజనేయస్వామి దేవస్థానం, పేర్రాజు సత్రం భూములు బహిరంగ కౌలు వేలం బుధవారం నిర్వహిస్తున్నట్లు తూబాడు గ్రూప్ టెంపుల్స్ ఈవో ఎన్.తులసీదాస్ చెప్పారు. ఉమామహేశ్వర స్వామి దేవస్థానంలో ఉదయం 10 గంటలకు జరిగే బహిరంగ వేలంలో ఆసక్తి గల రైతులు ధరావత్తు చెల్లించి పాల్గొనాలని కోరారు. ఉమామహేశ్వర స్వామి దేవస్థానానికి సంబంధించి 28.22 ఎకరాలు, చెన్నకేశవ స్వామి దేవస్థానానికి సంబంధించి 17.31 ఎకరాలు, ఆంజనేయస్వామి దేవస్థానానికి చెందిన 11.46 యకరాలు, పేర్రాజు సత్రానికి చెందిన 28.41 యకరాలు వెరశి 85.40 యకరాలకు బహిరంగ వేలం జరుగుతుందన్నారు. రాబోయే ఖరీఫ్ సీజన్ కాలనీకి వేలం జరుగుతుందన్నారు.

13 మందికి కాక్లియార్ ఇంప్లాంట్ సర్జరీలు

డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో నిర్వహణ



సర్జరీలు చేయించుకున్న పిల్లలు, వారి తల్లితండ్రులతో డాక్టర్లు

నరసరావుపేట: సత్తెనపల్లిరోడ్డులోని డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్‌లో పుట్టుకతో మూగ, చెవిటి పిల్లలకు ఆరోగ్యశ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా కాక్లియార్ ఇంప్లాంట్ సర్జరీలు ఒకేసారి 13 మంది పిల్లలకు చేసి వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపినట్లు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, ప్రముఖ రోబోటిక్ సర్జన్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం హాస్పిటల్‌లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. కాక్లియార్ ఇంప్లాంట్ సర్జరీ ఒకేసారి 13 మంది పిల్లలకు సర్జరీ చేయడం రెండు తెలుగు రాష్ట్రాల్లో రికార్డు అన్నారు. తమ హాస్పిటల్‌లో పనిచేసే ప్రముఖ కాక్లియర్ ఇంప్లాంట్ సర్జన్ డాక్టర్ రాజేష్ ఏపూరి వీటితో కలిపి 50 సర్జరీలు పూర్తి చేశారని అన్నారు. డాక్టర్ రాజేష్ మాట్లాడుతూ 12 గంటలు పట్టే ఒక్కో సర్జరీ ఒక గంటలో పూర్తి చేశామన్నారు. ఒక సర్జరీ నుంచి మొదలుకొని ఈరోజు 50 మంది పిల్లలకు పూర్తిస్థాయిలో ఒక్క కాంప్లికేషన్ కూడా లేకుండా కాక్లియార్ ఇంప్లాంట్ సర్జరీలు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు.

స్టంట్స్ గుండెకే కాదు కాళ్లకు కూడా వేయవచ్చు

షుగర్ వ్యాధితో దీర్ఘకాలిక పుండ్లతో భరించలేని నొప్పితో బాధపడుతూ మేరికపూడి వెంకయ్య అనే వ్యక్తి తమ హాస్పిటల్‌ను సంప్రదించగా అతనికి విజయవంతంగా కాలి రక్తనాళానికి స్టంటు అమర్చి అతడి కాలును కాపాడామని డాక్టర్ అంజిరెడ్డి పేర్కొన్నారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ శబరి గిరీష్ పెరిఫరల్ యాంజియోప్లాస్టి అనే విధానం ద్వారా కాళ్ల వేళ్లకు రక్తాన్ని తీసుకొచ్చే రక్తనాళాలకు స్టంట్ అమర్చి మూసుకుపోయిన రక్తనాళాలను తెరిపించి రక్తం సరఫరా అయ్యే విధంగా వైద్యం చేశారన్నారు. ఈ విధానం ద్వారా పేషెంట్‌కి దీర్ఘకాలిక పుండ్లు తగ్గిపోయి పూర్తిగా నొప్పి లేకుండా నయమైపోతుందన్నారు. ఇలాంటి నూతన విధానం మొట్టమొదటిసారిగా పల్నాడు జిల్లాలోని నరసరావుపేట డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్స్‌లోనే నిర్వహించామని పేర్కొన్నారు. సమావేశంలో పిల్లలు, వారి తల్లితండ్రులు, కాలు బాధితుడు పాల్గొన్నారు.

శైవ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులు

వినుకొండ టౌన్: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని వినుకొండ నుంచి ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం బాణావతు కోటేశ్వరరావు నాయక్ మంగళవారం తెలియచేశారు. వినుకొండ నుంచి కోటప్పకొండకు 43 సర్వీసులను నడుపుతుండగా శ్రీశైలంకు 13, త్రిపురాంతకంకు 7, మన్నేపల్లికి 4 ప్రత్యేక సర్వీసులను నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సర్వీసులను సాధారణ చార్జీలతో నడుపుతామన్నారు. ప్రజలు ఈ సర్వీసులను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఎన్నికలు సజావుగా జరిగేలా చూడాలి

ఈఆర్‌వో నారదముని



బీఎల్‌వోలకు శిక్షణనిస్తున్న ఈఆర్‌వో నారదముని, తహసీల్దార్లు

నాదెండ్ల: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలను సక్రమంగా జరిగేలా బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పనిచేయాలని చిలకలూరిపేట ఎలక్ట్రోలర్ రిటర్నింగ్ అధికారి బి.నారదముని చెప్పారు. గణపవరం చుండి రంగనాయకులు ఇంజినీరింగ్ కళాశాల ఆడిటోరియంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లుకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల శిక్షణ పొందిన అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనీలు కాట్రు శ్రీనివాసరావు, ఎల్.రాము, ఎండీ సుభానీ, అబ్బరాజు ప్రసాద్, ఎస్ శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరాచార్యులు, మాధవరావు, భాస్కర్, వెంకటబాబు, వీరమణిలు ఐదు అంశాలపై శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంల పనితీరు, ఈవీఎంలను గ్రామాల్లో మాక్‌పోలింగ్ నిర్వహించటం, 85ఏళ్లు పైబడిన వమో వృద్ధులు, వికలాంగులు, నోటిఫికేషన్ విడుదలైన ఐదు రోజుల్లోగా ఓటును ఇంటి వద్దనే వేసుకునేందుకు నమోదు చేయించాలన్నారు.

ఓటర్ల జాడబితాలో ఆబ్‌సెంట్లు, షిఫ్టింగ్‌లు, మరణాలు, గుర్తించి ప్రతి పోలింగ్ కేంద్రంలో 70 శాతం మించి ఓటింగ్ జరిగేలా ఓటర్లలో అవగాహన కలిగించాలన్నారు. ఇప్పటికే పోలింగ్ కేంద్రాలను ఆయా మండల తహసీల్దార్లు, బీఎల్‌వోల సాయంతో పరిశీలించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో నాదెండ్ల, యడ్లపాడు, చిలకలూరిపేట తహసీల్దార్లు డీవీబీ వరకుమార్, అషిరున్నిసాబేగం, ఎం.జ్వాలా నరసింహం తదితరులు పాల్గొన్నారు.

రేపల్లెకు వెళ్లి.. పింఛన్ ఇచ్చి..



దూరాలను సైతం లెక్క చేయకుండా వలంటీర్లు పింఛన్ దారులకు పింఛన్ అందచేస్తూ, లబ్ధిదారుల మోములో సంతోషాన్ని నింపుతున్నారు. జగనన్న లక్ష్యాలకు అనుగుణంగా వలంటీర్ వ్యవస్థ తమ బాధ్యతలను నిర్వహిస్తూ, ప్రజల మన్ననలు పొందుతుండడంలో ముందుంటుందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

పట్టణంలోని హనుమాన్ నగర్ సచివాలయ పరిధి లో నివాసం ఉంటున్న ఎం.తులసమ్మ (70) ఇటీవల రేపల్లెలో నివాసం ఉంటున్న తన కొడుకు చిట్టిబాబు వద్దకు వెళ్లింది. పింఛన్ తీసుకునే సమాయానికి అనారోగ్యంతో బాధపడుతూ కొడుకు వద్దనే ఉందన్న సమాచారం తెలుసుకున్న వలంటీర్ మతుకుమల్లి మేఘమాల, సచివాలయ అడ్మిన్ ఎస్. శ్రీనివాస రావుకు సమాచారాన్ని చేరవేసి, సోమవారం రేపల్లెకు చేరుకుని పింఛన్ అందచేయడం పట్ల లబ్ధిదారురాలు, కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

–వినుకొండ టౌన్

నేడు జగనన్న కాలనీ రిజిస్ట్రేషన్ దస్తావేజుల పంపిణీ

నాదెండ్ల: గణపవరం శ్రీ కెల్లంపల్లి భద్రాచలం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న కాలనీలో నిరుపేదలకు పంపిణీ చేసిన ప్లాట్లు రిజిస్ట్రేషన్ దస్తావేజులు అందజేయనున్నట్లు పంచాయతీ కార్యదర్శి మారుతిబాబు చెప్పారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమానికి మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు హాజరౌతారన్నారు. గ్రామంలోని నాలుగు సచివాలయాల పరిధిలో 1223 మందికి పట్టాలు పంపిణీ కాగా, 1116 మందికి రిజిస్ట్రేషన్ దస్తావేజులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మిగిలిన దస్తావేజులు త్వరలో పంపిణీ చేస్తామన్నారు.

నేడు సాతులూరులో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం

నాదెండ్ల: సాతులూరు గ్రామ సచివాలయంలో బుధవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. నాదెండ్ల పీహెచ్‌సీ వైద్య సిబ్బందితో పాటూ ఇరువురు స్పెషలిస్ట్‌లు హాజరౌతారన్నారు. వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిస్తామన్నారు. స్థానిక ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు

మహిళలకు మిషన్‌లు అందజేత

నరసరావుపేట టౌన్: సింక్రో సర్వ్ గ్లోబల్ సొల్యూషన్ ఆధ్వర్యంలో మంగళవారం సంఘ కార్యాలయంలో నిరుపేద మహిళలకు కుట్టు మిషన్‌లు అందజేశారు. స్టేట్ బ్యాంకు సహకారంతో మిషన్‌లు పంపిణీ చేసినట్లు సింక్రో సంస్థ మేనేజర్ ఆకుల వెంకట్ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ఆర్ఎం సీడీ రామ్ కుమార్, చీఫ్ మేనేజర్ డి.వి.ఎన్ స్వామి, మేనేజర్ ఎన్. గోపయ్య పాల్గొని మహిళలకు మిషన్‌లు పంపిణీ చేశారు.